## క్లుప్తంగా

### కరువు నష్టం అంచనా వేసిన కేంద్ర బృందం



**లక్ష్మీపురం(తిరువూరురూరల్):** మండలంలో వర్షాభావం కారణంగా ఎండిపోయిన పంటలను కేంద్ర అధికారుల బృందం గురువారం పరిశీలించింది. లక్ష్మీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించిన అధికారులు రైతులను కలిసి పంటనష్టం వివరాలను తెలుసుకున్నారు. భూగర్భ జలాలను పరిశీలించడంతో పాటు సాగునీటి సమస్యకు గల కారణాలను ఆరా తీశారు. కేంద్ర బృందంతో జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, తిరువూరు ఆర్డీవో మాధవి, వ్యవసాయ సంయుక్త సంచాలకులు కెనడీ, రైతు సంక్షేమ విభాగ సంయుక్త కార్యదర్శి పంకజ్ యాదవ్, ఆయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పొన్నుస్వామి, మహేష్ కుమార్, సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన అండర్ సెక్రటరీ కైలాస్ శుక్లా, ఏవోలు పద్మ, సాయిశ్రీ తదితరులు ఉన్నారు.

### శానిటరీ న్యాప్‌కిన్స్ తయారీలో శిక్షణ

**నున్న(విజయవాడరూరల్):** పర్యావరణ పరిరక్షణకు అనువైన శానిటరీ న్యాప్‌కిన్స్ తయారీ శిక్షణ కార్యక్రమం గురువారం నున్న గ్రామంలోని గీతా మందిరంలో జరిగింది. ఇడీఐఐ, యాక్సెంచర్, గైడ్ ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. 15 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో 50 మంది స్వయం సహాయక గ్రూపుల మహిళలు పాల్గొన్నారు. బనానా ఫైబర్ క్లాత్‌తో శానిటరీ న్యాప్‌కిన్స్ తయారు చేయడం ప్యాకింగ్ చేయడంతో పాటు మార్కెటింగ్ మెలకువలను సంస్థల ప్రతినిధులు తెలియచేశారు. శిక్షణ కాలం పూర్తయిన పిమ్మట మహిళలు న్యాప్‌కిన్స్ తయారు చేసుకుని సొంతంగా వ్యాపారం చేసుకోవడం వలన ఆర్థికంగా పరిపుష్టి సాధించుకో వచ్చునని ఈడీఐఐ ప్రతినిధి కమలేష్ కుమార్ తెలియజేశారు. మార్కెటింగ్ చేసే మెలకువలను ఈ సందర్భంగా తెలియచేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎం జి.చంద్రశేఖర్, కొండలరావు, కోఆర్డినేటర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గైడ్ ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్ మురళీకృష్ణ, సురేష్‌బాబు, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

### బాక్సింగ్‌లో రాణికి రజత పతకం



**ఉయ్యూరు:** బాక్సింగ్‌లో ఉయ్యూరుకు చెందిన ఎం.సుప్రజారాణి రాష్ట్రస్థాయిలో రజత పతకాన్ని సాధించింది. ఇటీవల విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో బాలికల అండర్-17 విభాగంలో 60-63 కేజీల కేటగిరీలో సుప్రజారాణి సత్తా చాటి సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా సుప్రజారాణిని బాక్సింగ్ యూనియన్ జిల్లా కార్యదర్శి వైవీఎస్ ఉమామహేశ్వరరావు, కోచ్ సూరి అభినందించారు.

### అన్నదానానికి రూ.1.25 లక్షల విరాళం



**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి విజయవాడ ప్రసాదంపాడు ప్రాంతానికి చెందిన కొర్రపాటి లక్ష్మీభాయమ్మ రూ.1.25 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు మొత్తాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

### ఇంధన పొదుపు వారోత్సవాలు ప్రారంభం

**ఇబ్రహీంపట్నం:** ఎన్టీటీపీఎస్‌లో ఇంధన పొదుపు వారోత్సవాలు గురువారం ప్రారంభమైయ్యాయి. సర్వీస్ భవనం నుంచి సంస్థ ప్రధాన గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ పి.నవీన్‌గౌతమ్ మాట్లాడుతూ మన అవసరాలకు ముడిచమురు 75 శాతం దిగుమతి ద్వారా వస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న వనరులు దాదాపు 40 ఏళ్ల మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. బొగ్గు, చమురు, సహజ వాయువులు ఏర్పడటానికి వేల సంవత్సరాలు పడుతాయన్నారు. ఇంధన పొదుపు పాటించాలని సూచించారు. సీనియర్, జూనియర్ ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# నాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## ఏపీఐఐసీ చైర్మన్ బండి పుణ్యశీల



సాంస్కృతిక ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పుణ్యశీల, బెల్లం దుర్గ, విజయకుమార్, జీవన్‌కుమార్

**విజయవాడ కల్చరల్:** నాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఏపీఐఐసీ చైర్మన్ బండి పుణ్యశీల అన్నారు. రంగస్థల ప్రముఖుడు గుమ్మడి జయరాజ్ కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద గురువారం జయరాజ్ 11 వ సంస్మరణ సభ, పద్యనాటక ప్రదర్శన, రంగస్థల నటుడు కె. పరబ్రహ్మచారికి ఆత్మీయ సత్కారం, జయరాజ్ కళాపీఠం వార్షికోత్సవ సాంస్కృతిక మహోత్సవాల బ్రోచర్ ఆవిష్కరించారు. పుణ్యశీల మాట్లాడుతూ రంగస్థల కళాకారులను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ మాట్లాతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున రాష్ట్ర స్థాయిలో నాటిక పోటీలు నిర్వహించి కళాకారులకు గుర్తింపు కార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా వైఎస్సార్ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయకుమార్ మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా జయరాజ్ కళాపీఠం ఆధ్వర్యంలో నాటక రంగంలోని వివిధ రంగాలకు చెందిన వారిని గుర్తించి వారికి పురస్కారాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. జయరాజ్ కళాపీఠం నిర్వాహకుడు జీవన్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి గుమ్మడి జయరాజ్ విశిష్టమైన సేవలను అందించినట్లు కొనియాడారు. కార్యక్రమంలో గుమ్మడి అన్వేష్, ఆచంట బాలజీ నాయుడు, చింతలపూడి నాగేశ్వరరావు, ఏసుపాదంతోపాటు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్‌ను పుణ్యశీల, బెల్లం దుర్గ ఆవిష్కరించారు. రంగస్థలానికి చెందిన పరబ్రహ్మాచారిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా చింతామణి, సత్యహరిశ్చంద్ర పద్యనాటకంలోని ప్రధాన సన్నివేశాలు ప్రదర్శించారు.

# విధుల్లో అప్రమత్తంగా ఉండండి

## డీసీపీ విశాల్‌గున్ని



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ విశాల్‌గున్ని

**విజయవాడ స్పోర్ట్స్:** జిల్లాలో నేరాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఏసీపీలు, సీఐలకు డీసీపీ విశాల్ గున్ని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ సమీక్షా సమావేశాన్ని ఈ నెల 13వ తేదీన జగ్గయ్యపేటలో డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ప్రస్తావించిన అంశాలను జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందితో డీసీపీ విశాల్‌గున్ని విజయవాడలోని పోలీస్ కమిషనరేట్‌లో గురువారం చర్చించారు. ప్రతి ఒక్కరూ విధుల్లో మెరుగైన పనితీరు కనబర్చాలని, క్రమం తప్పకుండా ఫుట్ పెట్రోలింగ్, పెట్రోలింగ్, బీట్స్ సంఖ్యను పెంచి అనుమానితులపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పలు కేసుల్లో పట్టుబడిన నిందితులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని, నేరాలకు పాల్పడటం వల్ల కలిగే నష్టాలపై నిందితులకు సవివరంగా చెప్పాలని కోరారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని కోరారు. గంజాయి కేసుల్లో నిర్దేశిత సమయానికి చార్జ్‌షీట్ వేయాలని ఆదేశించారు. మహిళల కేసులను అలసత్వం చేయకుండా వెంటనే దర్యాప్తు చేయాలని, మహిళలపై ఈవ్ టీజింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్టేషన్‌కు తీసుకొచ్చే నిందితులతో జాగ్రత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ బ్లాక్ స్పాట్‌లను గుర్తిస్తూ తగు చర్యలు తీసుకుని రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని తెలిపారు. బ్లేడ్ బ్యాచ్, గంజాయి సేవించే, విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా పెంచాలని ఆదేశించారు. సమావేశంలో ఏసీపీలు డాక్టర్ కె.హనుమంతరావు, డాక్టర్ బి.రవికిరణ్, సీఐలు పాల్గొన్నారు.

# మాకినేని బసవపున్నయ్యకు నివాళి



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

**కృష్ణలంక(విజయవాడతూర్పు):** దళితులు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటుపడిన గొప్ప వ్యక్తి మాకినేని బసవపున్నయ్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. స్వాతంత్రసమరయోధుడు, మార్కిస్టు మేధావి మాకినేని బసవపున్నయ్య 109వ జయంతి సందర్భంగా గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో కేంద్రం ఇన్‌చార్జి బి.ఆర్.తులసీరావు అధ్యక్షత గురువారం సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు బసవపున్నయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బసవపున్నయ్య స్వాతంత్రోద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన దిశగా సమాజంలోని అణగారిన ప్రజలకు సేవ, అభ్యున్నతి, సాంస్కృతిక వికాసం కోసం ఎం.బి.విజ్ఞాన కేంద్రం పనిచేస్తుందని చెప్పారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ పి.మధు మాట్లాడుతూ బసవపున్నయ్య స్వాతంత్రోద్యమ కాలం నుంచే బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. బసవపున్నయ్య ఆశయ బాటలో ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళలు, బడుగు బలహీన వర్గాల కోసం కుట్టుశిక్షణ, ఎంబ్రాయిడరీ, కంప్యూటర్ లాంటి అనేక శిక్షణల ద్వారా వారి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నర్సింగరావు, ఎం.బి.విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.మురళీకృష్ణ, వి.రామరాజు, టి.క్రాంతికిరణ్, స్వరూపరాణి తదితరులున్నారు.

### అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. జోడుబొమ్మల సెంటర్‌కు చెందిన వడ్డాది దుర్గాలక్ష్మి, యుగంధర్ భార్యాభర్తలు. యుగంధర్ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుంటాడు. కొంత కాలంగా యుగంధర్ భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. భర్త వేధింపులకు తోడు అత్తమామలు కనకరాజు, చిన్నమ్మడులతో పాటు ఆడపడుచు జయలక్ష్మి ఇబ్బందులు పెట్టడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# కనకదుర్గనగర్‌లో టాయిలెట్స్ తనిఖీ

## శానిటేషన్ సిబ్బందికి ఈవో సూచన



టాయిలెట్స్‌ను పరిశీలిస్తున్న ఈవో రామారావు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** భక్తులు వినియోగించే టాయిలెట్స్‌ను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని దుర్గగుడి ఈవో కెఎస్.రామారావు శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. కనకదుర్గనగర్‌లోని దేవస్థాన టాయిలెట్స్‌ను దుర్గగుడి ఈవో రామారావు గురువారం తనిఖీ చేశారు. టాయిలెట్స్‌లో నీరు సక్రమంగా రావడం లేదని పలువురు భక్తులు ఈవోకు ఫిర్యాదు చేశారు. యూరినల్స్ పోసే ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉండటంతో పాటు కొన్ని చోట్ల నీళ్లు వదిలే పైపులు లేకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. అదే విధంగా టాయిలెట్స్, లెట్రిన్స్ దుర్వాసనగా ఉన్నాయని పేర్కొనగా, టాయిలెట్స్‌లో ఎల్లప్పుడు నీరు అందుబాటులో ఉంచడంతో పాటు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం టాయిలెట్స్ వెనుక కొండ ప్రాంతాన్ని పరిశీలించి ఇంజినీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# సగరుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



సగరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సగర కులానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని, సగర సంఘీయుల అభ్యున్నతికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సీతన్నపేటలోని వీఎంసీ కళ్యాణ మండపంలో సగర భగీరథ సంఘీయుల ఆత్మీయ సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం సమాజంలోని అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ముఖ్యంగా సగరులకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ప్రతిష్టాత్మక దుర్గమ్మ తల్లి ఆలయ ఛైర్మన్‌గా సగరులను నియమించడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. ఏపీ సగర రాజ్‌పుత్ సేవా సమితి సభ్యుడు మద్దిబోయిన వెంకట్రామయ్య, కగ్గా పాండురంగారావు, ధనికొండ వెంకటేశ్వరరావు, జలసూత్రం నాగరాజు, రాణిమొకల సతీష్, ధనికొండ ఆంజనేయులు, జె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### మలబార్‌లో మైన్ డైమండ్‌షో



**లబ్బీపేట(విజయవాడతూర్పు):** మహాత్మాగాంధీరోడ్డులోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూమ్‌లో మైన్ డైమండ్ షో గురువారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను ఆ షోరూమ్ కస్టమర్స్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల 19 వరకూ నిర్వహించే ఈ డైమండ్ షోలో విభిన్న రకాల డైమండ్ నెక్లెస్‌లు, వెడ్డింగ్ కలెక్షన్స్, లైట్ వెయిట్ హారాలు అందుబాటులో ఉంటాయని షోరూమ్ మేనేజర్ సిద్దిక్ తెలిపారు. అదే విధంగా డైమండ్ నగలు కొనుగోలుపై పలు రాయితీలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

# 22న బీసీ సంక్షేమ సంఘం సభ



అరుణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న బీసీ నేతలు

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** జాతీయ బీసీ సంక్షేమ సంఘం సభ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 22వ తేదీన నిర్వహించనున్నామని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ తెలిపారు. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో గురువారం సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం నగర యువజన అధ్యక్షుడిగా పీసా అరుణ్‌కుమార్‌కు నియామక పత్రాన్ని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు కనిశెట్టి లక్ష్మణరావు అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీల సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 22వ తేదీన సంఘం ఆధ్వర్యంలో బీసీల రథయాత్ర చిట్టినగర్ సెంటర్ నుంచి ప్రారంభమై తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు కొనసాగుతుందని వెల్లడించారు. కళాక్షేత్రంలో నిర్వహించే సభకు బీసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో భాగంగా అరుణ్‌కుమార్‌కు లాకా వెంగళరావు నియామక పత్రాన్ని అందచేయగా, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం విజయవాడ నగర ఉపాధ్యక్షులు తమ్మిన దుర్గారావు, శీరం మల్లికార్జునరావు, పి. లీల, సరోజిని, ఆయేషా, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాటిని సేవించడం వల్ల బతుకు దుర్భరంగా మారుతుందని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గొళ్ళమూడి శేఖర్‌బాబు అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలను స్క్రీన్ ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. యువత మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు.

# అథ్లెటిక్స్ పోటీల్లో కేబీఎన్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు

**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** కృష్ణా విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో కేబీఎన్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి పలు బహుమతులు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. అంతర్ కళాశాల అథ్లెటిక్ పోటీలు ఇటీవల ఏజీ అండ్ ఎస్‌జి సిద్ధార్థ కళాశాల ఉయ్యూరులో జరిగాయని పేర్కొన్నారు. అందులో తమ విద్యార్థులైన జి.పవన్‌కుమార్ హేమర్‌త్రోలో గోల్డ్ మెడల్, అలాగే డిస్కత్రోలో గోల్డ్ మెడల్, కె.అనఘాలక్ష్మి డిస్కత్రోలో గోల్డ్ మెడల్, బీవీ లావణ్య వంద మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్, సుభాష్ ట్రిపుల్ జంప్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారని తెలిపారు. త్వరలో భువనేశ్వర్‌లో, తమిళనాడులో జరగబోయే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్ పోటీలకు తమ విద్యార్థులైన జి.పవన్ కుమార్, అనఘాలక్ష్మి, బి.లావణ్య ఎంపికయ్యారని చెప్పారు. వారికి శిక్షణ ఇచ్చిన కళాశాల క్రీడావిభాగాధిపతి డి.హేమచంద్రరావుని కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ అభినందించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సులు భద్రత ప్రమాణాలు పాటించాలి

## డీటీసీ పురేంద్ర

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** భద్రతా ప్రమాణాలు పాటించకుండా స్కూల్ బస్సులను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ ఎం.పురేంద్ర పాఠశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడే విధంగా స్కూల్ బస్సులను నడిపితే ఊరుకునేది లేదని, అటువంటి వాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామని డీటీసీ పేర్కొన్నారు. రోడ్డు టాక్స్‌లు, ఇన్సూరెన్స్‌లు కట్టకుండా ఫిట్‌నెస్, రూట్ పర్మిట్లు తీసుకోకుండా బస్సులు నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో తనిఖీలు చేయగా సరైన రికార్డులు, రోడ్డు టాక్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా, 51 మంది విద్యార్థులను తీసుకువెళ్లాల్సిన బస్సులో 79 మందిని ఎక్కించారని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు లేని వ్యక్తితో బస్సు నడపడాన్ని గమనించి బస్సు సీజ్ చేసి కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ విషయంపై సంబంధిత స్కూల్ యాజమాన్యానికి నోటీసులు కూడా జారీ చేశామని వెల్లడించారు. పాఠశాలల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ బాధ్యతగా వాహనాలు నడపాలని డీటీసీ పురేంద్ర సూచించారు.

### రేపు బాలోత్సవం ద్వితీయ పిల్లల పండుగ

**గన్నవరం:** స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 16న జరిగే బాలోత్సవం ద్వితీయ పిల్లల పండుగను విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ అధ్యక్షుడు బొడ్డు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బాలోత్సవం పోస్టర్‌ను కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గన్నె వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల అభిరుచులు, ఆసక్తికి అనుగుణంగా జ్ఞానతృష్ణను, సృజనను ప్రోత్సహించేందుకు, సామాజిక చైతన్యం పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు బాలోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. 22 అకడమిక్, 10 సాంస్కృతిక విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఎంట్రీ ఫారమ్స్ సమర్పించిన పాఠశాలల విద్యార్థులు శనివారం ఉదయం 9 గంటలకు ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. బాలోత్సవానికి హాజరయ్యే విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

# పంట నష్టం అంచనాల నమోదు పరిశీలన



కాకులపాడులో పంట నష్టం అంచనాలను పరిశీలిస్తున్న ఏవో భవాని, అధికారులు

**హనుమాన్‌జంక్షన్ రూరల్:** మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంట నష్టం అంచనాలను రూపొందించేందుకు క్షేత్రస్థాయిలో అధికార బృందాలు పర్యటిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో వీఆర్వో, వీఏఏలు ప్రతి రైతు పొలాన్ని పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. బాపులపాడు మండలంలోని కాకులపాడు, రామన్నగూడెం, వేలేరులో జరుగుతున్న పంట నష్టం అంచనాలను ఏవో జొన్నలగడ్డ భవాని పరిశీలించారు. రైతులు మొలకెత్తిన, రంగు మారిన ధాన్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆమె మాట్లాడుతూ మొలకెత్తిన, రంగు మారిన ధాన్యం నమూనాలను పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కార్యాలయానికి పంపుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 23 వరి ధాన్యం నమూనాలను పంపినట్లు తెలిపారు. ఎఫ్‌సీఐ అధికారుల బృందం కూడా ఈ నమూనాలను పరీక్షించి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్లు ఏవో భవాని తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా రంగు మారిన ధాన్యం కొనుగోలు చేపడతామని రైతులకు వివరించారు. వరి పంటకు ప్రభుత్వం ఇప్పటికే హెక్టారుకు రూ.17 వేలు, మొక్కజొన్న పంటకు రూ.12,500 ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా ఆర్బీకేలలో సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# విశ్వబ్రాహ్మణ సంఘం స్థలం స్వాధీనం



కోర్టు ఆదేశాలతో స్థలం స్వాధీనం చేసుకున్న విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు

**సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):** సత్యనారాయణపురం అబ్బూరివారివీధిలో కబ్జాకు గురైన విశ్వబ్రాహ్మణ సంఘం నిర్వహణలోని దేవాదాయ శాఖకు చెందిన స్థలం న్యాయస్థానం ఆదేశాలతో తిరిగి సంఘానికి దక్కింది. ఈ సందర్భంగా జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం చైర్మన్ తోలేటి శ్రీకాంత్, అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తిలకు స్వాధీన పత్రాలను అందజేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘం నిర్వాహణలో ఉన్న దేవాదాయ శాఖకు చెందిన టేకి నరసింహాచార్యులు ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు సంబంధించి 367 గజాల స్థలం కొంతకాలంగా ఇతరులు ఆక్రమణ చేయడంతో సంఘం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఇటీవల న్యాయస్థానం నుంచి తమకు అనుకూలంగా తీర్పు రావడంతో గురువారం దేవాదాయ శాఖ అధికారులు స్థలాన్ని పరిశీలించి విశ్వబ్రాహ్మణ సంఘానికి స్వాధీన పత్రాలను అందజేశారు. తమ న్యాయ పోరాటంలో సహకరించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు, దేవాదాయ శాఖ అధికారులకు ఈ సందర్భంగా శ్రీకాంత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి, కుప్పిలి సత్యనారాయణ, జవ్వాది సుధీర్, పాలడుగు శివ, చేబ్రోలు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవిజయ గోసంరక్షణ సంఘానికి నాలుగెకరాల అప్పగింత

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** శ్రీవిజయ గోసంరక్షణ స్థల సమస్యను జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీ రావు పరిష్కరించారు. 22ఏ జాబితా నుంచి తొలగించి నాలుగెకరాల భూమిని గోశాలకు అప్పగించారు. గోశాలకు భూమిని అప్పగించడం పట్ల శ్రీవిజయ గోరక్షణ సంఘం సభ్యులు కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంఘం కార్యదర్శి గోవింద కుమార్ సాభు, కార్యవర్గ సభ్యుడు అడుసుమిల్లి కృష్ణప్రసాద్ కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేలాది గోవులను సంరక్షిస్తూ హిందూ ధర్మ పరిరక్షణలో పాలుపంచుకుంటున్న ప్రతి ఒక్కరినీ అభినందించారు. అప్పగించిన స్థలంలో గోసంరక్షణకు అవసరమైన పనులను చేపట్టడంలో తనవంతు సహకారం అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విజయ గోసంరక్షణ సంఘం కార్యదర్శి సాభు మాట్లాడుతూ 1927లో ప్రారంభమైన గోశాలలో నేడు 1800 గోవులను సంరక్షిస్తున్నామని చెప్పారు. గతంలో గోశాలకు గొల్లపూడిలో భూమిని కేటాయించడం జరిగిందన్నారు. గొల్లపూడిలో ఉన్న స్థలాన్ని 22ఏ నుంచి తొలగించి తిరిగి గోశాలకు అప్పగించాలని కోరిన వెంటనే కలెక్టర్ స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీవిజయ గోసంరక్షణ సంఘం ప్రెసిడెంట్ గోపిశెట్టి మల్లయ్య, కార్యవర్గ సభ్యులు విశల్‌ప్రసాద్ లోయా, సురేష్‌కుమార్ సోలంకి, తూనుగుంట్ల శ్రీనివాస్, పీయూష్‌దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రయాణికులకు బహుమతులు



**జగ్గయ్యపేట అర్బన్:** ఏపీఎస్ ఆర్టీసీ వారు ప్రయాణికుల కోసం ప్రవేశపెట్టిన బహుమతి పథకం(గిఫ్ట్ స్కీమ్) ద్వారా పలువురు ప్రయాణికులు బహుమతులు గెలుచుకున్నట్లు పేట డిపో మేనేజర్ ఎం.రఘురాం తెలిపారు. పేట డిపో పరిధిలో జగ్గయ్యపేట-వైరా, పెనుగంచిప్రోలు-విజయవాడ రూట్‌లో రెండు వారాల పాటు ప్రయాణించిన ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం ద్వారా ప్రయాణికులు, విద్యార్థుల సమక్షంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటించారు. డ్రాలో వైరా రూటులో ప్రథమ, ద్వితీయ బహుమతులను జగ్గయ్యపేటకు చెందిన జి.సత్యావతి, కె.రవి గెలుచుకోగా, పెనుగంచిప్రోలు రూటులో పెనుగంచిప్రోలుకు చెందిన డి.ఆంజనేయులు, విజయవాడకు చెందిన బి.సాంబశివరావు బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు ఈనెల 18వతేదీ మధ్యాహ్నం మూడుగంటలకు పేట ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో బహుమతులు అందజేయనున్నట్లు డీఎం తెలిపారు. డిపో సూపర్‌వైజర్లు, ట్రాఫిక్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.